

గెటప్..సెటప్..గోమతి!

- మిస్ ఇండియా రేసులో జిల్లా యువతి
- మిస్ ఆంధ్ర పోటీలో విజేత
- చదువులోనూ నంబర్ వన్
- ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం


తల్లిదండ్రులతో గోమతిరెడ్డి (ఫైల్)


ముక్కా గోమతిరెడ్డి

సాక్షి, రాయచోటి : గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ రంగ కుటుంబంలో జన్మించిన యువతి.. ఫ్యాషన్ రంగం అంటే కాస్త వెనుకడుగు వేసే పరిస్థితుల్లో ముందుకే అడుగేసింది. విజయబావుటా ఎగురవేస్తోంది. ఒక పక్క పట్టుదల, మరో పక్క కృషి...ఇంకో పక్క ఏకాగ్రతతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అనుకున్న లక్ష్యం వైపు నడిపిస్తోంది. ఎంతకష్టమైనా.. లక్ష్యాన్ని అందుకునే క్రమంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటూ విజయం వైపు పయనిస్తోంది. చిన్న వయస్సులోనే చరిత్ర సృష్టించేందుకు అవసరమైన కృషి చేస్తోంది. ఫ్యాషన్ రంగంలో తనుకన్న కలలను సాకారం చేసుకునేందుకు అనుక్షణం కృషి చేస్తూ ముందుకు వెళుతోంది. ఇప్పటికే ఫెమినా మిస్ ఆంధ్రగా నిలిచిన ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లెకు చెందిన ముక్కా గోమతిరెడ్డి మిస్ ఇండియా సాధనలో ప్రస్తుతం నిమగ్నమైంది.

రైతు కుటుంబం నుంచి..

ముక్కవారిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి, అరుణకుమారిల కుమార్తె ముక్కా గోమతిరెడ్డి. వ్యవసాయ రంగంలో ఉన్నప్పటికీ ప్రస్తుతం శ్రీనివాసులురెడ్డి కాంట్రాక్టర్‌గా, తల్లి అరుణ చెస్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఆన్‌లైన్ కోచ్‌గా ఉన్నారు. ప్రస్తుతం బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. గోమతి 1 నుంచి 10వ తరగతి వరకు రియాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకున్నారు. తర్వాత సీఎంఆర్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ చదివారు. అనంతరం ఎప్సిలాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

ఫ్యాషన్ రంగం వైపు అడుగులు

బెంగుళూరులో చదువుకుంటున్న వయస్సులోనే గోమతిరెడ్డి మోడలింగ్ రంగం వైపు అడుగులు వేశారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఫ్యాషన్ ర్యాంప్‌వాక్‌లోనూ పాల్గొన్నారు. అంతేకాకుండా ప్రసిద్ధ డిజైనర్ల వద్ద కూడా ఆమె పనిచేశారు. డ్యాన్స్, స్కెచింగ్, పుస్తకాలు చదవడం , జిమ్‌కు వెళ్లడం, నటన పట్ల ఆమెకు ఉన్న అభిరుచులు. కళాశాలలో ఇంటర్ చదివే సమయంలో ఫ్యాషన్ రంగంవైపు వెళ్లాలన్న ఆలోచన వచ్చింది. ఈ క్రమంలో టైమ్స్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన ఫ్రెష్ ఫేస్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది. తర్వాత 2020లో ఆమె బెంగుళూరులో సౌత్ ఇండియా స్థాయిలో నిర్వహించిన ఫెమినా స్టైలిస్టా పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది జనవరి 25న ముంబైలో నిర్వహించిన మిస్ ఇండియా–2023 ఎంపికల్లో భాగంగా పాల్గొన్న గోమతిరెడ్డి మిస్ ఆంధ్రగా నిలిచారు. ఆమె ఫ్యాషన్ రంగంలోనే కాకుండా జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్, స్కెచింగ్‌లో అనేక అవార్డులు, స్కాలర్‌షిప్‌లను కూడా గెలుచుకున్నారు. సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ ఎల్లప్పుడూ సానుకూల దృక్పథం ఉండటంతో ఆమెకు వరుస విజయాలు లభిస్తున్నాయి. ప్రత్యేకంగా మూడేళ్ల క్రితం మోడలింగ్ రంగంలో అడుగుపెట్టిన యువతి ఎక్కడా కోచింగ్, ఇతర అవగాహన సదస్సులకు వెళ్లకుండా స్వంత ఆలోచన, యూట్యూబ్‌లో ఫ్యాషన్‌కు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు చూసి విజయబావుటా ఎగురవేస్తోంది.


ఫెమినా స్టైలిస్టా సౌత్ ఇండియా పోటీలో గోమతిరెడ్డి

అందమే కాదు..

మిస్ వరల్డ్, మిస్ ఇండియా, మిస్ ఆంధ్ర అంటే ఒక్క అందమే కాదు.. నిర్వాహకులు ప్రతి అంశంలోనూ రాణించిన వారినే విజేతగా ఎంపిక చేస్తారు. అందులో అందం చూస్తారు...నడకను పరిశీలిస్తారు...పర్సనాలిటీ, ఇంటెలిజెన్స్, ఫ్యాషన్, కరెంట్ అఫైర్స్, ఇతర అనేక విభాగాలకు సంబంధించిన అంశాలపై లోతుగా విశ్లేషిస్తారు.

ఏప్రిల్‌లో మిస్ ఇండియా ఫైనల్స్

మిస్ ఆంధ్రగా విజయకేతనం ఎగురవేసిన గోమతిరెడ్డి వచ్చే నెల మణిపూర్‌లో జరిగే ఫైనల్ పోటీకి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సెమీస్‌గా భావించే మిస్ ఆంధ్రలో గెలిచిన ఆమె ఈ నెల 5వ తేదీన ముంబైలో మొదలైన 45 రోజుల ప్రత్యేక ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది యువతులతో జరిగే టైటిల్ వేటలో గోమతిరెడ్డి పోటీ పడుతూ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

మిస్ ఇండియా.. నా కల

నా కల మిస్ ఇండియా సాధించడమే! రాష్ట్రం తరఫున పోటీ పడుతున్న నాకు మీ అందరి ఆశీర్వాదాలు కావాలి. ప్రతి అంశాన్ని నేను పాజిటివ్‌గా తీసుకుని ముందుకు వెళుతున్నా. అంతకంటే ముందు నా తల్లిదండ్రులు, సోదరుడు అందించిన ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయిలో రాణించగలుగుతున్నా. నా అన్న పేరు మీద ఈ–ప్లాట్‌ఫాం ఉపయోగించి సమాజ సేవ చేసేందుకు ప్రణాళిక రూపొందించా. – ముక్కా గోమతిరెడ్డి

వనితా.. వందనం



రాత్రీపగలు లేదు.. తిండితిప్పలు వగైరా సరిగా లేవు.. అయినా మహిళలు అన్నింటా తామై కనిపిస్తున్నారు. అన్ని పనుల్లో మగమహారాజులకు దీటుగా నిలుస్తున్నారు. జీవనసమరంలో గెలుస్తున్నారు. కడప నగరంలో మంగళవారం కనిపించిన దృశ్యాలివి.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, కడప.









న్యూస్‌రీల్

డీఈఓగా శ్రీరామ పురుషోత్తం



రాయచోటి: అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారిగా చిత్తూరు నుంచి శ్రీరామ పురుషోత్తంను బదిలీ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. కాగా, ఇక్కడ పనిచేస్తున్న రాఘవరెడ్డిని వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారిగా బదిలీ చేశారు.

ఫుడ్ లైసెన్స్ తప్పనిసరి

రాయచోటి టౌన్ : ఫుడ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండా అమ్మకాలు చేయరాదని డిస్ట్రిక్ట్ ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ కె.షమీమ్‌బాషు అన్నారు. 'ఈట్ రైట్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయచోటి కూరగాయల మార్కెట్‌లో ఫుడ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళాను నిర్వహించారు. ఆహార పదార్థాలను అమ్మే వ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ తప్పనిసరి అని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

భవనాలు త్వరగా పూర్తిచేయండి


డీఎస్పీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి: రాయచోటిలో నూతనంగా నిర్మిస్తున్న డీఎస్పీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పక్కా భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. మంగళవారం ఆయా భవనాలను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ మహ్మద్ రఫీ ఉన్నారు.

వైవీయూ ఆధునిక వెబ్‌సైట్ ప్రారంభం

వైవీయూ: ఆధునీకీకరించిన యోగివేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీ బ్రౌన్ గురించి, గ్రంథాలయ ఆవిర్భావం తదితరాల గురించి.. అలాగే వైవీయూ అనుబంధ కళాశాలలకు సంబంధించిన సర్క్యులర్‌లు, సిలబస్ తదితర వివరాలు వైవీయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమీ కల్యాణం


సీతారాములకు కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతా సమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవమూర్తులను వేర్వేరుగా ఉంచారు. సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి.. నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు.

పక్కాగా బ్రహ్మోత్సవ పనులు

శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల పనుల ఏర్పాట్లపై రాజీ పడేది లేదని టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు అన్నారు. ఒంటిమిట్టలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడానికి ఇక 23 రోజులు మాత్రమే ఉన్నాయని, పనులు నాణ్యతతో పూర్తి చేయాలని బాధ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈ రామ్మూర్తి, టీటీడీ విద్యుత్ విభాగం డీఈ చంద్రశేఖర్, ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్యాణ వేదిక వద్ద అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాల కౌంటర్లను పరిశీలించామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల మళ్లింపు చేపడతామన్నారు. ఆయన వెంట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు తదితరులున్నారు.

ఏఎఫ్‌యూ పరీక్షా ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ అంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌కు చెందిన (ఆర్21) మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం వీసీ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు, ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి.సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్బేబరాత్


విద్యుద్దీప కాంతులతో ముస్తాబైన మసీదు

రాయచోటి టౌన్: పవిత్ర రంజాన్ ఆగమనాన్ని తెలియజేస్తూ షబ్బే బరాత్ (బడీ రాత్) పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం ముస్లింలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలకరించడంతో పండుగ కళ కనిపించింది. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి పరిమళ ద్రవ్యాలతో సమీపంలోని మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. రాత్రి ఇషా నమాజ్ తర్వాత తమ పాపాలు క్షమించబడే గొప్ప రాత్రిగా భావిస్తూ అల్లాహ్‌ను వేడుకున్నారు. అన్ని మసీదుల్లో మత గురువులు, ఆధ్యాత్మిక ప్రసంగీకుల ఆధ్వర్యంలో పవిత్ర రాత్రి విశిష్టత గురించి వివరించారు. దీంతో పాటు రానున్న పవిత్ర మాసం గొప్పతనాన్ని, అందుకు సంబంధించి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కాగా, ఈ పవిత్ర రాత్రి నిర్వహణకు సంబంధించి మసీదు కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలైన నమాజ్, జికర్, పవిత్ర ఖురాన్ పఠనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఫజర్ నమాజ్ తర్వాత తమ దివంగతుల పెద్దల సమాధుల వద్దకు వెళ్లి పాపాలను క్షమించాలని దైవాన్ని కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల ఆర్‌ఓ, కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి

అనంతపురం అర్బన్: 'పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి. ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేయాలి' అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనంతపురం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. పోలింగ్ నిర్వహణపై మంగళవారం ఆమె కలెక్టరేట్ నుంచి శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి నిర్వహణ, పంపిణీ, అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ఇలా ప్రతి అంశంపైన అధికారులకు స్పష్టమైన విధివిధానాలను ఎన్నికల కమిషన్ రూపొందించిందన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల ఉల్లంఘన ఏ స్థాయిలోనూ జరగకుండా అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేవారికి వీలైనంత ముందుగానే పోస్టల్ బ్యాలెట్ పేపర్ అందించాలన్నారు. 800 మంది ఓటర్లున్న పోలింగ్ కేంద్రంలో జంబో బ్యాలెట్ పెట్టి వినియోగించాలని సూచించారు. పోలింగ్ రోజున కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ విధుల్లోని అధికారులు, సిబ్బందికి వసతి, భోజన సదుపాయం, కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా పోలింగ్ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

సజావుగా ఎన్నికల ప్రక్రియ


స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, జిల్లా కలెక్టర్, ఎస్పీలు

రాయచోటి : ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను అనుసరించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ ఎన్నికల జిల్లా నోడల్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్‌లో మంగళవారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ, తదితర ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఆదేశించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అబ్జర్వర్ సమీక్ష

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై అబ్జర్వర్, సీనియర్ ఐఏఎస్ అధికారి కోన శశిధర్ అధికారులతో సమీక్షించారు. మంగళవారం ఆయన రాయచోటి స్టేట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో సుదీర్ఘంగా చర్చించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు.

రేపు ఫెన్సింగ్ జట్ల ఎంపిక

రాజంపేట టౌన్: రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా ఫెన్సింగ్ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ క్రీడ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏ.చంద్రకళావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9490863918 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఘనంగా నీలకంట్రావుపేట ఉరుసు

రామాపురం : రామాపురం మండలం నీలకంట్రావుపేట సమీపంలోని సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలి, రహమతుల్లా ఆల్లై బాబా, జలీల్ మస్తాన్ వలీ గార్ల ఉరుసు ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేకంగా ఈ ఉరుసు ఉత్సవాలలో భాగంగా రాత్రికి జెండా ప్రదర్శన, బెంగళూరు, బొంబాయిలకు చెందిన అస్మాని, ఖలీల్ సైదాలతో ఖవ్వాలీ పోటీ నిర్వహించారు. ఉరుసుకు వచ్చిన భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు తమ మొక్కులలో భాగంగా దర్గాలో జెండాలు, తల నీలాలు సమర్పించారు.

శ్రీగంధం దుంగలు స్వాధీనం



ఫారెస్టు అధికారుల అదుపులో శ్రీగంధం దుంగలు, నిందితుడు

సుండుపల్లె (వీరబల్లి): సానిపాయి రేంజ్, సానిపాయి సెక్షన్, జాండ్రపెంట బీటు పరిధిలో సోదాలు నిర్వహిస్తుండగా అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన శ్రీగంధం దుంగలను, డీలక్స్ బైక్‌ను స్వాధీనం చేసుకొని కోడూరు చెంద్రాయుడు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ కె.పీరయ్య తెలిపారు. దుంగల బరువు 7.1 కేజీలు ఉంటుందన్నారు. మరో ముగ్గురు నిందితులు పారిపోయారని వారికోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటేశు

రాజంపేట: రాజంపేట సరిహద్దు గ్రామమైన వెంకటరాజంపేట(కడప–రేణిగుంట ఎన్‌హెచ్)వద్ద మంగళవారం కొండూరు వెంకటేశు (60)అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనను రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఊటుకూరు గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు.

ఎట్టకేలకు ఉల్లంఘేశ్వరాలయానికి మోక్షం

- 9న కామాక్షి సమేత ఉల్లంఘేశ్వరుని విగ్రహ ప్రతిష్ట
- ఘనంగా ప్రారంభమైన ప్రత్యేక పూజలు

నందలూరు(రాజంపేట): చరిత్రాత్మక సంపదకు నిలయమైన నందలూరు గ్రామంలో వెలసిన చోళుల కాలం నాటి ఉల్లంఘేశ్వరాలయానికి మోక్షం లభించింది. దాదాపు ఏడు సంవత్సరాల క్రితం పురాతన ఆలయం పునర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చొరవతో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆశించిన స్థాయిలో నిధులు సమకూరక పోవడంతో ఆలయ నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మేడా రఘునాథరెడ్డి ఆలయంపై విచారించారు. ఆలయం పూర్తి చేసేందుకు తన సొంత నిధులతో పునర్ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలో భాగంగా లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి, ఆలయ నిర్మాణం పూర్తిచేశారు.

ఘనంగా ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట

ఉలంఘేశ్వరాలయం నిర్మాణం పూర్తి అనంతరం మంగళవారం నుంచి విగ్రహప్రతిష్ట మహోత్సవ పూజలు పండితులు, పురోహితులు చేపట్టారు. ఆలయ ప్రాంగణలో హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు. రెండురోజుల పాటు ఈ పూజలు జరగనున్నాయి. ఈ పూజలు ఈనెల 9 వరకు కొనసాగనున్నాయి. గురువారం ఉదయం విగ్రహ ప్రతిష్ట పూజలు ఉంటాయి. అనంతరం స్వామివారి కల్యాణం జరగనుంది. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేపట్టనున్నారు.

ఈ కార్యక్రమాలు ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మేడా రఘునాథ్‌రెడ్డి, మేడా మధుసూదనరెడ్డి, పెన్నా సిమెంట్ సంస్థ అధినేత వేణుగోపాల్‌రెడ్డి హాజరు కానున్నారు. ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అనంతరం అన్ని విధాలుగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు.



నందలూరులో నూతనంగా నిర్మించిన చోళుల కాలం నాటి ఆలయం



కామాక్షి అమ్మవారు



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న ఉల్లంఘేశ్వరుడు, నందీశ్వరుడు

బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హర్షం వ్యక్తం చేసిన ఆర్టీసీ ఛైర్మన్



కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా 2736 బస్సుల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 1500 డీజిల్ బస్సులు, 1000 ఎలక్ట్రానిక్ బస్సుల కొనుగోళ్లకు అనుమతులు లభించాయి. అలాగే 200 డీజల్‌తో నడుస్తున్న బస్సులు ఎలక్ట్రానిక్ బస్సులుగా మార్పు చేయనున్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 15 మీటర్ల అంబారి బస్సులను కొనుగోలు చేయనున్నారు. అలాగే అంతర్ రాష్ట్ర సర్వీసులపై కీలక ఒప్పందాలను అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త బస్సుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వంతో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆర్టీసీ సంస్థ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. కొత్త బస్సుల కొనుగోలుకు అనుమతులు ఇచ్చి చరిత్రలో నిలిచిపోతారన్నారు.

వైభవంగా ప్రారంభమైన మల్లూరమ్మ జాతర

తరలి వచ్చినభక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో మల్లూరమ్మ తల్లి జాతర అమ్మవారికి పంచామృతాభిషేకం కార్యక్రమంతో వైభవోపేతంగా ప్రారంభమైంది. మంగళవారం రాత్రి అమ్మవారు పుట్టిన ఊరు తిమ్మారెడ్డిగారిపల్లె నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో జబర్దస్త్ హాస్య నటులు, ఢీ ప్రోగ్రాం నృత్యకళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కుబడులున్న వారు వివిధ గ్రామాల నుంచి అమ్మవారికి చాందినీబండ్లు కట్టారు. రాయచోటి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో రాయచోటి రూరల్ సీఐ లింగప్ప, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ తల్లి

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన రామాంజులు(75), ఇతని మనవడు రాజేష్(40)లు మంగళవారం పుంగనూరు రోడ్డులోని కనుమలోగంగమ్మ వారిని దర్శించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా, మార్గ మధ్యంలో వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు కారులో ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. అదేవిధంగా కలికిరి మండలం పలవలి గ్రామానికి చెందిన పెద్దరెడ్డెప్ప(75) సొంత పనిపై నగరిమడుగు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తూ గడి గ్రామం వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా, సెల్ ఫోన్ మాట్లాడుతూ ద్విచక్రవాహనంలో వచ్చిన యువకుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెద్దరెడ్డెప్పను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కలికిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ట్రాన్స్‌జెండర్ పండుపై చర్యలు తీసుకోవాలి

- హిజ్రా ముసుగులో దందాలు నడిపిస్తున్నాడని ఆరోపణలు
- ఆంధ్రా, రాయలసీమ హిజ్రాల మధ్య తగవులు పెడుతున్నాడని ఆవేదన
- మదనపల్లెలో సమావేశమైన రాయలసీమ జిల్లాల ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ సభ్యులు



రాయలసీమ ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు హాసినినాయక్

మదనపల్లె : ట్రాన్స్‌జెండర్ ముసుగులో హిజ్రా కమ్యూనిటీని తన ఆధిపత్యంలోకి తెచ్చుకుని, పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్న నకిలీ ట్రాన్స్‌జెండర్ కాకినాడ పండుపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రాయలసీమ జిల్లాల ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ హిజ్రాకాలనీలో మంగళవారం రాయలసీమ, నెల్లూరు జిల్లాకు చెందిన హిజ్రాలు పెద్దసంఖ్యలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పోర్టులో కూలిగా పనిచేసుకుంటున్న కాకినాడ పండు అనే వ్యక్తి ఓ హిజ్రాను వివాహం చేసుకుని, అటుపై తాను హిజ్రానని చెప్పుకుంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా రాయలసీమ ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు హాసినినాయక్ మాట్లాడుతూ...కాకినాడ పండు ట్రాన్స్‌జెండర్ల మధ్య ప్రాంతాలవారీగా విభేదాలు సృష్టిస్తూ, ఆంధ్రా, రాయలసీమ హిజ్రాల మధ్య చిచ్చు పెడుతున్నాడని ఆరోపించారు. రాయలసీమ హిజ్రాలు స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు నిలబెట్టుకుంటూ పెద్దలందరితో కలిసి సుఖసంతోషాలతో జీవనం సాగిస్తుంటే ఎక్కడి నుంచో ఇక్కడకు వచ్చి తమ కమ్యూనిటీపై రుబాబు చేయాలని భావించడం కాకినాడ పండుకు తగదన్నారు. గతంలో నెల్లూరులో హిజ్రాలను కాకినాడ పండు రైల్వేదోపిడీలు, పిక్‌పాకెట్‌లు, దొంగతనాలకు వినియోగించి కమ్యూనిటీకి చెడ్డపేరు తీసుకువస్తే తామంతా వ్యతిరేకించామన్నారు. దీనిని మనసులో పెట్టుకుని తమపై అకారణంగా నిందలు మోపుతూ, రాయలసీమలో తన ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ఆంధ్రా హిజ్రాలతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, కాకినాడ పండును కలిసికట్టుగా ఎదుర్కొంటామని, రాష్ట్ర ప్రభుత్వం తమకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నెల్లూరు జిల్లా ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కావ్య, పెద్దలు సుజాతమ్మ నాయక్, చానమ్మ నాయక్, సుమ, షాకీరా, షబానా, సాయిరా, లైలా, ఉషా, అమరావతి, హేమ, అనూ, డాలీ, సల్మా తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

మదనపల్లె : గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో బావిలో పడి మృతిచెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఎస్టేట్ సమీపంలోని ఇసుకనూతిపల్లె వద్ద ఉన్న వ్యవసాయ బావిలో 50–55 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఓ వ్యక్తి పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి రెండోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మురళీకృష్ణ ఆదేశాలతో ఏఎస్ఐ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీయించారు. శవపరీక్ష నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. అనుమానాస్పద మృతి కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం



వెన్నెల (ఫైల్)

బి.కొత్తకోట: పుట్టింటికి ఆటోలో బయలుదేరిన వివాహిత ఇంటికి చేరకుండానే అదృశ్యం కావడంపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ రవీంద్రనాయక్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. భార్యాభర్తలైన శ్రీనివాసులు, వెన్నెల (22) స్థానిక బీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. వెన్నెల స్వగ్రామం పెద్దతిప్పసముద్రం మండలంలోని కందుకూరు. ఈనెల 3న వెన్నెల తల్లి దగ్గరకు వెళ్లాలని భర్తకు చెప్పింది. దీంతో భర్త కందుకూరు వెళ్లే ఆటోలో వెన్నెలను పంపాడు. తర్వాత ఈ విషయాన్ని కందుకూరులోని అత్తకు ఫోన్‌చేసి చెప్పగా వెన్నెల ఇంటికి రాలేదని చెప్పడంతో ఆందోళకు గురైన శ్రీనివాసులు పలుచోట్ల గాలించాడు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాత కక్షలతో తోటకు నిప్పు



తుమ్మచెట్లపల్లె వద్ద కాలిపోయిన పండ్లతోట

కురబలకోట : మండలంలోని అంగళ్లు గ్రామం తుమ్మచెట్లపల్లెలో పండ్ల తోటకు పాతకక్షలతో కొందరు నిప్పు పెట్టి కాల్చి వేశారని బాధితురాలు జె. గంగులమ్మ మంగళవారం ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమె ఏడేళ్లుగా ఊరి వద్ద అర ఎకరం పొలంలో జామ, టెంకాయ, నిమ్మ, మామిడి తదితర చెట్లు నాటి సంరక్షిస్తోంది. వీటిని రెండు రోజుల క్రితం అదే ఊరికి చెందిన గిట్టని వారు నిప్పు పెట్టడంతో చెట్లతో పాటు డ్రిప్ పైపులు, నీటి పైపులు కూడా కాలిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత కక్షలతో తోటకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

భూవివాదంలో ఘర్షణ

మదనపల్లె : భూవివాదంలో ఘర్షణ జరిగి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం ములకలచెరువు మండలంలో జరిగింది. బి.కొత్తకోటకు చెందిన హసన్‌వలి(53), మహబూబ్‌బాషా(58), సుబహాన్‌సాబ్(60)లకు ములకలచెరువు మండలంలో తండ్రి రెడ్డిసాహెబ్ పేరుపై భూములు ఉన్నాయి. కొంతభూమిని ఇతరులకు విక్రయించగా, మరికొంత భూమి వీరికి రావాల్సి ఉంది. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు మంగళవారం పెద్దపాళ్యంలోని భూములవద్దకు వెళ్లారు. భూసర్వే నిర్వహించేందుకు సర్వేయర్ వచ్చి సర్వే చేస్తుండగా, పెద్దపాళ్యం గ్రామానికి చెందిన కె.చిన్నగంగులప్ప, కె.గంగాద్రి, గణేష్, నారాయణస్వామి, రాంబాబు, వేణుగోపాల్, అమరనాథ్‌తో పాటు మరికొంతమంది కలిసి దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. దాడిలో హసన్‌వలి, మహబూబ్‌బాషాలకు తలపై తీవ్రగాయాలు కాగా, సుబహాన్‌సాహెబ్ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. బాధితులను కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై ములకలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

షాపింగ్‌మాల్ దుకాణదారులకు నోటీసులు

సిద్దవటం : ఉప్పరపల్లె గ్రామంలో జాతీయ రహదారి పక్కన నిర్మించిన షాపింగ్‌మాల్ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ శంకర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 936/ఎ లోని ప్రభుత్వం స్థలంలో దుకాణాలు, షాపింగ్‌మాల్‌లు నిర్మించుకున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలలో నివాస గృహాలు మాత్రమే నిర్మించుకోవాల్సి ఉందని, షాపింగ్ మాల్‌లను నిర్మించినందున ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో షాపింగ్‌మాల్ యజమానులు ఐదుగురికి నోటీసులు జారీ చేశామన్నారు. వారు బుధవారం షాపింగ్‌మాల్ నిర్మాణాలకు సంబంధించి ధ్రువపత్రాలతో హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తహసీల్దారు తెలిపారు.

ద్విచక్రవాహనాల చోరీ కేసులో అన్నదమ్ములకు జైలుశిక్ష



ద్విచక్రవాహనాల చోరీ కేసులో జైలుశిక్ష పడిన సోదరులు

మదనపల్లె : ద్విచక్రవాహనాల చోరీ కేసులో అన్నదమ్ములకు జైలుశిక్ష విధిస్తూ మదనపల్లె రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన శివకుమార్, అతడి సోదరుడు లక్ష్మీపతి గత ఏడాది డిసెంబరు 16న మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ చంద్రమోహన్ నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువు కావడంతో సోదరులిద్దరికీ 18నెలలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీగా డాక్టర్.ఉమాదేవి వ్యవహరించి, నిందితులకు జైలుశిక్ష పడేలా వాదించారని సీఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష



జైలు శిక్ష పడిన నిందితులు

కలికిరి : ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులకు వాల్మీకిపురం కోర్టు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని మేడికుర్తి గ్రామం కొమ్మేపల్లికి చెందిన పి.రెడ్డెమ్మ మార్చి 11, 2020న గ్రామ సమీపంలో వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో చైను లాక్కెళ్లారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, కలికిరి ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్న తమిళనాడుకు చెందిన ఇరానీ యువకులు యూనస్(22), మొగల్ జాఫర్(22)లను నిందితులుగా గుర్తించి కోర్టులో హాజరు పరిచారు. ఏపీపీ శంకర్ వాదనలు విన్న జడ్జి సీహెచ్ రామకృష్ణ నిందితులకు 435 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఘనంగా గంధోత్సవం

దువ్వూరులో ప్రారంభమైన జమాల్‌వలీ ఉరుసు

దువ్వూరు : మండలంలోని కృష్ణంపల్లెలో మంగళవారం జమాల్ వలి స్వామి ఉరుసు సందర్భంగా గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. గంధం, పూల దుప్పట్లను నిర్వాహకుల ఇంటి నుంచి మంగళ వాయిద్యాలతో దర్గాకు తీసుకొచ్చారు. స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేసి చక్కెర చదివింపులు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి సమాధిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు


ఉరుసు సందర్భంగా మంగళవారం ఎద్దులకు బండలాగుడు పోటీలను జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య ప్రారంభించారు. ఈ పోటీలను ఆసక్తిగా ప్రజలు తిలకించారు. ఈ పోటీల్లో చెన్నూరు మండలం రాచిన్నాయపల్లెకు చెందిన పసుపుల బాబయ్య ఎద్దులు ప్రథమ బహుమతి రూ.30,116, రెండో బహుమతి రూ.20,116 ఆళ్లగడ్డ మండలం పెద్దకందుకూరుకు చెందిన విజయకుమార్ ఎద్దులు, మూడో బహుమతి రూ.10,116 ప్రొద్దుటూరుకు చెందిన పసుపుల శశికుమార్ ఎద్దులు, నాలుగో బహుమతి రూ.5,116 ప్రొద్దుటూరుకు చెందిన పుల్లా నారాయణ రెడ్డి ఎద్దులు గెలుపొందాయి. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు.

నేడు వైభవంగా ఉరుసు

జమాల్ వలి స్వామి ఉరుసు బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రాత్రి 8.30 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



జమాల్‌వలి స్వామి సమాధిని దర్శించుకుంటున్న భక్తులు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మేరువ కృష్ణయ్య